సాక్షి
ఆదిలాబాద్

మంగళవారం । 10 । జనవరి । 2023



హ్యాండ్‌బాల్ పోటీల విజేత వరంగల్

మంచిర్యాల జిల్లా మందమర్రిలో జరిగిన రాష్ట్ర స్థాయి 44వ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీల్లో వరంగల్ జట్టు విజేతగా నిలిచింది.

8లో▸



రిమ్స్‌లో సమస్యలు తీర్చాలి

ఎదులాపురం: రిమ్స్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఈ విషయమై డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌కి రిమ్స్‌లో వినతి పత్రం అందజేశారు.

గరిష్టం/కనిష్టం
30.1/11.8

వాతావరణం

జిల్లాలో చలి తీవ్రత కొనసాగుతుంది. ఏజెన్సీ ప్రాంతాల్లో శీతల గాలులు వీస్తాయి. ఉదయం పొగమంచు ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎంఎల్‌హెచ్‌పీ పోస్టుల ప్రొవిజినల్ జాబితా విడుదల

ఆదిలాబాద్‌టౌన్: వైద్యారోగ్య శాఖలో మిడిల్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ) పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల కాగా పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొవిజినల్ జాబితాను సోమవారం విడుదల చేసినట్లు డీఎంహెచ్‌ఓ నరేందర్ రాథోడ్ తెలిపారు. జాబితాను నోటీసు బోర్డుపై ప్రదర్శించడంతో పాటు ఆన్‌లైన్‌లో పొందుపర్చడం జరిగిందని పేర్కొన్నారు. ఏవైన అభ్యంతరాలు, పొరపాట్లు ఉంటే అభ్యర్థులు ఈనెల 11న కార్యాలయానికి నేరుగా వచ్చి అర్జీలు అందజేయవచ్చని వివరించారు.

నేడు కంటి వెలుగు నిర్వహణపై అవగాహన

కైలాస్‌నగర్: కంటి వెలుగు కార్యక్రమ నిర్వహణపై ఈ నెల 10వ తేదీన ఉదయం 10.30గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ నరేందర్ రాథోడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్ర కరణ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లుగా వెల్లడించారు. ఈ సదస్సుకు జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, ఎంపీపీలు, ఎంపీడీవోలు, మండల, జిల్లా ప్రత్యేక అధికారులు, మెడికల్ ఆఫీసర్లు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

వ్యవసాయ అధికారుల సంఘం డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

కైలాస్‌నగర్: తెలంగాణ వ్యవసాయాధికారుల సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్, డైరీలను సోమవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య, ఏడీఏ రమేష్‌లతో కలిసి తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. వ్యవసాయాధికారులు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే జోగు రామన్నను తన క్యాంపు కార్యాలయంలో శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆష్రఫ్ అహ్మద్, కె.శివకుమార్, కోశాధికారి వివేక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్, విశ్వామిత్ర, శ్రీనివాస్‌రెడ్డి, ఉన్నీసా, సంధ్యా, రేవతి పాల్గొన్నారు.

ఉపకార వేతనాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఎదులాపురం: తెలంగాణ కార్మిక సంక్షేమ మండలి ద్వారా ప్రతిభ ఆధారంగా కార్మికుల పిల్లలకు, కార్మికులకు ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు జిల్లా సహాయ కార్మిక కమిషనర్ జగదీశ్వర్‌రెడ్డి సోమవారం తెలిపారు. అభ్యర్థులు 2021–22 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులై ఉండాలని, దరఖాస్తులను కార్మికశాఖ కార్యాలయంలో అందించాలని కోరారు. అభ్యర్థులను తరగతి కోర్సులలో మార్కుల శాతం ఆధారంగా ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి, ఐటీఐ విద్యార్థులకు రూ.1000, పాలిటెక్నిక్‌కు రూ.1500, మెడిసిన్, లా, బీఎస్సీ (అగ్రికల్చర్, వెటర్నరి, నర్సింగ్) వీఎస్సీ(హార్టికల్చర్), బీసీఏ, ఎంసీఏ, బీఫార్మసీ, ఎం.ఫార్మసీ, బీబీఏ, ఎంబీఏ, డిప్లామా ఇన్ మెడికల్ లేబోరేటరీ టెక్నీషియన్, పీజీ డిప్లామా ఇన్ మెడికల్ లేబోరెటరీ టెక్నీషియన్ విద్యార్థులకు రూ.2వేలు ఉపకార వేతనంగా అందించడం జరుగుతుందని, అర్హులు ఫిబ్రవరి 15లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కారుణ్య నియామకాలకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న కలెక్టర్

కైలాస్‌నగర్: కారుణ్య నియామకాల కింద ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ కోసం సోమవారం రాత్రి స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్, అడిషనల్ కలెక్టర్ ఎన్.నటరాజ్‌ల ఆధ్వర్యంలో అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 53 మంది అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉండగా 51 మంది వచ్చారు. వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఆఫీస్ సబార్డినేట్ పోస్టులను భర్తీ చేశారు. సహకార శాఖలో ఖాళీగా ఉన్న ఓ జూనియర్ అసిస్టెంట్ పోస్టును భర్తీ చేయగా, 26 మంది ఆఫీస్ సబార్డినెట్ పోస్టులను భర్తీ చేశారు. వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ కౌన్సెలింగ్‌లో ఆర్డీవో రమేష్ రాథోడ్, కలెక్టరేట్ ఏఓ అరవింద్ కుమార్ పాల్గొన్నారు.

రిమ్స్‌లో ట్యూటర్ పోస్టులు

- మరో 16 భర్తీకి ఉత్తర్వులు జారీ
- ఇప్పటికే ఖాళీలతో సతమతం
- ఈ పోస్టులైనా భర్తీకి నోచుకునేనా..?
- ప్రభుత్వ ఉద్యోగాలతో ఇటీవల 10 పోస్టులు ఖాళీ



రిమ్స్ ఆస్పత్రి

రిమ్స్‌లో పోస్టుల వివరాలు...	
రిమ్స్‌లో మొత్తం వైద్యుల పోస్టులు	151
పనిచేస్తున్న వైద్యులు	107
ఖాళీ పోస్టులు	44
కొత్తగా మంజూరైన ట్యూటర్ పోస్టులు	16

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ రిమ్స్ మెడికల్ కళాశాలకు కొత్తగా 16 ట్యూటర్ పోస్టులు మంజూరయ్యాయి. దీనికి సంబంధించి సోమవారం డీఎంఈ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 14 మెడికల్ కళాశాలలకు పోస్టులు మంజూరు చేయగా, ఇందులో రిమ్స్‌కు కూడా పోస్టులు దక్కాయి. అయితే ఇప్పటికే అన్ని విభాగాలు కలిపి 151 పోస్టులు మంజూరు ఉండగా, 56 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏళ్లుగా ఈ పోస్టులే భర్తీకి నోచడం లేదు. పలుమార్లు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నా ఇక్కడ పనిచేసేందుకు వైద్యులు ఆసక్తి చూపడం లేదు. తాజాగా మరో 16 ట్యూటర్ పోస్టులు మంజూరవ్వడం శుభపరిణామం అయినప్పటికీ ఈ పోస్టులైనా భర్తీ అవుతాయా అనే అనుమానాలున్నాయి. ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ వహించి వాటి భర్తీ జరిగేలా చూసినట్లయితే రిమ్స్ విద్యార్థులకు బోధన అందనుండగా, ఆస్పత్రికి వచ్చే పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందే అవకాశం ఉంది.

ఖాళీలతో సతమతం..

రాజీవ్ గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్) కళాశాలకు ఇదివరకు 151 పోస్టులు మంజూరయ్యాయి. ఈ కళాశాలను దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 2008లో ఏర్పాటు చేశారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని పేదలకు వైద్యం పరంగా వరప్రదాయినిగా మారింది. అయితే ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు పూర్తిస్థాయిలో పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు. 21 ప్రొఫెసర్ పోస్టులకు 15 పోస్టులు భర్తీ ఉండగా, 6 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు 30కి 18 మంది పనిచేస్తున్నారు. 12పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 41కి గాను 35 మంది పనిచేస్తున్నారు. 6 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. లెక్చరర్ ఇన్ బయోఫిజిక్స్ ఒక పోస్టు ఉండగా, ఖాళీగా ఉంది. అదేవిధంగా ఎపిడాలమిస్ట్ కమ్ లెక్చరర్ పోస్టు కూడా ఖాళీగానే ఉంది. స్టటిస్టిషియన్ కమ్ లెక్చరర్ ఒక పోస్టు ఉండగా పనిచేస్తున్నారు. ట్యూటర్ పోస్టులు 56 ఉండగా, 28 మంది పనిచేస్తున్నారు. ఇదివరకు 38 మంది పనిచేయగా ఇటీవల ప్రభుత్వం పీహెచ్‌సీల్లో రెగ్యులర్ పోస్టులను భర్తీ చేయగా 10 మంది ప్రభుత్వ కొలువులు సాధించారు. దీంతో ఈ స్థానాలు ఖాళీ అయ్యాయి. ప్రస్తుతం 28 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీనికి తోడు ప్రభుత్వం 16 పోస్టులు మంజూరు చేసింది. 44 పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. ఎంత మంది విధుల్లో చేరుతారనేది వేచిచూడాల్సిందే.

అందని వైద్యం..

ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న పెద్ద ఆస్పత్రి ఇదే. వైద్యుల పోస్టులు ఖాళీగా ఉండడంతో మెడికోలకు బోధన పరంగా, ఇటు రోగులకు వైద్యం పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రిమ్స్‌లో 500 పడకలు ఉన్నాయి. రోజుకు 500 నుంచి 800 వరకు ఔట్‌పేషెంట్లు వస్తుంటారు. వైద్యుల కొరత కారణంగా నాణ్యమైన వైద్యసేవలు అందకుండా పోతున్నాయి. జూనియర్ డాక్టర్లే రిమ్స్‌కు పెద్ద దిక్కుగా మారారు. అప్పుడే వైద్య ఎంబీబీఎస్ పూర్తి చేసుకొని వీరు రోగులకు సేవలు అందిస్తున్నారు. అయితే పూర్తిస్థాయిలో నాణ్యమైన వైద్యసేవలు అందడం లేదు. రిమ్స్‌లో పనిచేస్తున్న మిగితా వైద్యులు సైతం పూర్తిస్థాయిలో సమయం కేటాయించకపోవడంతో రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యులు అందుబాటులో ఉండాల్సి ఉన్నప్పటికీ కొంతమంది వైద్యులు మధ్యాహ్నమే ఇంటిముఖం పడుతున్నారు. కాగా రిమ్స్‌కు మంజూరైన పోస్టుల గురించి రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను ఫోన్‌లో వివరణ కోరగా.. పోస్టుల మంజూరుకు సంబంధించి మెయిల్ రాలేదని, పోస్టులు మంజూరు కావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని వివరించారు.

జాతీయస్థాయిలో సత్తా చాటాలి



మాట్లాడుతున్న విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

- శాస్త్ర సాంకేతికతతోనే సమాజం అభివృద్ధి
- తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాలి
- విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- నిర్మల్‌లో రాష్ట్రస్థాయి వైజ్ఞానిక మేళా ప్రారంభం
- వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన విద్యార్థులు



వినూత్న ఆలోచనతో తన ప్రతిభను మంత్రికి వివరించి శభాష్ అనిపించుకున్న చిన్నారి

నిర్మల్‌రూరల్: విద్యార్థులు విద్యతో పాటు శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించి జాతీయస్థాయిలో సత్తా చాటాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కొండాపూర్ సెయింట్ థామస్ పాఠశాలలో సోమవారం డీఈవో రవీందర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక మేళా, ఇన్‌స్పైర్ మనక్ ప్రదర్శనను దేవదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాస్త్ర సాంకేతికతోనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యార్థులు తమ మెదడుకు పదును పెట్టి నూతన ఆవిష్కరణలు చేయాలన్నారు. ఈ ప్రదర్శన నుంచి 50 మంది విద్యార్థులను ఎంపిక చేసి జాతీయ స్థాయికి పంపిస్తామన్నారు. విద్యార్థులు మేధోశక్తిని చాటేలా ఉపాధ్యాయులు వారి వెన్నంటి ఉండి ప్రోత్సహించాలన్నారు. నేటి బాల శాస్త్రవేత్తలు రాబోయే సమాజానికి ఉపయోగపడాలని సూచించారు. విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు.

విజ్ఞానం ఎంతనేర్చినా తక్కువే

దేవదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ విజ్ఞానం ఎంత నేర్చినా తక్కువేనన్నారు. రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్ జిల్లాకు రావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. సరస్వతీ అమ్మవారు కొలువుదీరిన జిల్లా విద్యారంగంలో ముందుండాలని ఆశాభావం వ్యక్తం చేశారు. బాసర ట్రిపుల్‌ఐటీలో నెలకొన్న సమస్యలను ఐటీశాఖ మంత్రి కేటీఆర్ చొరవతో మరో రెండుమూడు నెలల్లో పరిష్కరిస్తామన్నారు. రాబోయే రోజుల్లో 60 శాతం మంది ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్ వస్తుందన్నారు. మన ఊరు–మన బడి కార్యక్రమం ద్వారా ప్రతి మండలంలోని రెండు పాఠశాలలను అన్ని హంగులతో తీర్చిదిద్దుతున్నామన్నారు. రెండో విడతలో ట్రైబల్ పాఠశాలలకు కూడా నిధులు వెచ్చించి అభివృద్ధి చేస్తామన్నారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దేవసేన మాట్లాడుతూ మనిషి జీవితంలో ప్రతిరోజు సైన్స్ ఉపయోగపడుతుందన్నారు. ఉపాధ్యాయులు నేర్పించే సైన్స్ పేదవాడికి కూడా ఉపయోగపడాలన్నారు. తరగతి గదుల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు విజ్ఞానంతో పాటు మానవత్వం కూడా నేర్పాలన్నారు. ప్రపంచంలోకెల్లా మన దేశమే విజ్ఞానానికి మూలమన్నారు. విద్యార్థుల్లో ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి , క్రియాశక్తి పెంపొందించాలన్నారు. కలెక్టర్ ముషరఫ్ అలీ మాట్లాడుతూ మనిషి జీవితంలో ప్రతినిత్యం సైన్స్ ఒక భాగమైందన్నారు. సైన్స్‌తోనే జీవితం ముడిపడి ఉందని, వ్యవసాయం, పాఠశాల, మీడియా ఏ రంగంలో చూసినా సైన్స్‌దే కీలకపాత్ర అన్నారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థుల ప్రదర్శనలను మంత్రులు, అధికారులు పరిశీలించారు. అంతకుముందు సెయింట్ థామస్ పాఠశాల, సోఫీనగర్ గురుకుల పాఠశాల విద్యార్థులు చేసిన స్వాగత నృత్యాలు అలరించాయి. జుమ్మేరాత్‌పేట్ హైస్కూల్, శాంతినికేతన్ ఉన్నత పాఠశాలల ఎన్‌సీసీ విద్యార్థులు గౌరవ వందనం చేశారు. ఇదిలా ఉండగా మధ్యాహ్న భోజనం ఆలస్యం కావడంతో కుభీర్ మండలం కిరుగుల్ బి పాఠశాలకు చెందిన విద్యార్థిని సొమ్మసిల్లి పడిపోయింది. దీంతో 108లో ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కార్యక్రమంలో జెడ్పీచైర్‌పర్సన్ విజయలక్ష్మి, ముధోల్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, రేఖానాయక్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమరెడ్డి, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ రాధారెడ్డి, అదనపు కలెక్టర్లు హేమంత్ బోర్కడే, రాంబాబు, బాసర ట్రిపుల్‌ఐటీ వైస్‌చాన్స్‌లర్ వెంకటరమణ, వివిధ జిల్లాల డీఈవోలు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలను సత్వరం పరిష్కరించాలి

- కలెక్టర్ సిక్తా పట్నాయక్



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

కైలాస్‌నగర్: ప్రజావాణికి వచ్చిన అర్జీలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎన్.నటరాజ్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితుల అర్జీలను సంబంధిత అధికారులకు అందజేస్తూ సాధ్యాసాధ్యాల మేరకు వాటిని పరిశీలించాలని సూచించారు. పింఛన్లు, వైద్యం భూ సంబంధిత, ఉపాధి, ధరణి, దళితబంధు, డబుల్ బెడ్‌రూం ఇండ్ల మంజూరు, తదితర సమస్యలపై వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ దరఖాస్తులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో రమేష్ రాథోడ్, మున్సిపల్ కమిషనర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే విజయాలు

- ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి



ఎస్పీకి మొక్కను అందిస్తున్న పోలీసు అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: సమష్టి కృషితోనే విజయాలు సాధ్యమవుతాయని ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్రజల భద్రత సురక్షితమైన జిల్లాగా దేశంలోనే 5వ స్థానం రావడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. సోమవారం ఎస్పీకి పోలీసు అధికారులు, పలు సంఘాల ప్రజాప్రతినిధులు శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ ఘనత కష్టపడి అహర్నిశలు ప్రజల కోసం పనిచేసిన పోలీసులందరిదని పేర్కొన్నారు. జిల్లాకు దేశంలో 5వ స్థానం, రాష్ట్రంలో మొదటి స్థానం దక్కడం ఆనందంగా ఉందన్నారు. హోంగార్డు నుంచి పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో అదనపు ఎస్పీలు శ్రీనివాస్‌రావ్, సమయ్‌జాన్‌రావ్, డీసీఆర్బీ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, ఏఓ యూసుఫ్ అలీ, సీఐలు పురుషోత్తంచారి, గుణవంత్‌రావు, వెంకటి, శ్రీపాల్, వంశీకృష్ణ, కృష్ణమూర్తి, ఐటీసెల్ ఇన్‌చార్జి మురాద్, హిందూ ఉత్సవ సమితి నాయకులు హనుమండ్లు, కృష్ణ, ఉదయ్‌కుమార్, భాస్కర్‌గౌడ్, లెనిన్ ఉన్నారు.

క్యాంప్ నిర్వహించాలని రిమ్స్ డైరెక్టర్‌కు వినతి



రిమ్స్ డైరెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌అర్బన్: జిల్లాలోని దివ్యాంగులు రైల్వేపాసులు పొందేందుకు అవసరమైన ఎల్ఆర్ నంబర్ల కేటాయింపునకు ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా వికలాంగుల, నిరుద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులకు రైల్వేపాసుల నిమిత్తం ఎల్ఆర్ నంబర్ అవసరముంటుందని, ఆ నంబర్ తీసుకునేందుకు దివ్యాంగులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. క్యాంప్ నిర్వహిస్తే దివ్యాంగులందరూ ఒకేరోజు రిమ్స్‌కు వచ్చి ధ్రువీకరణ పత్రాలు చూయించి ఎల్ఆర్ నంబర్ తీసుకుంటారని పేర్కొన్నారు. ఆ నంబర్‌ను తీసుకుని నాందేడ్‌కు వెళ్లాల్సి ఉంటుందని, అక్కడ పాసులు జారీ చేస్తారని పేర్కొన్నారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ సలీమ్, రాకేష్, సతీష్, రాజశేఖర్, లక్ష్మారెడ్డి, లచ్చన్న ఉన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



నిరసనలో బార్ అసోసియేషన్ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిపై ఆ జిల్లా కలెక్టర్ కేసు పెట్టడాన్ని నిరసిస్తూ జిల్లా కేంద్రంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సోమవారం విధులను బహిష్కరించి కోర్టు ప్రాంగణంలో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ వృత్తిలో భాగంగా కోర్టు నుంచి నోటీసులు అందజేయడానికి వెళ్లిన న్యాయవాదిపై కలెక్టర్ కేసు పెట్టడం సరికాదని పేర్కొన్నారు. ఆ జిల్లా కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ అసోసియేషన్ సభ్యులు వెంకట్ కుమార్, గ్రహీష్, అబ్దుల్ రహీం, దేవేందర్ సింగ్, శ్రీనివాస్, రమణయ్య, భద్రీశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త హంగులతో 'అతిథి'

- ప్రారంభమైన కొత్త అతిథి గృహ నిర్మాణ పనులు
- శిథిలావస్థకు చేరిన భవనం కూల్చివేత
- వచ్చే ఏడాదిలోగా భవనం అందుబాటులోకి..

కొత్త అతిథిగృహ అంచనా వ్యయం	: రూ.2.20 కోట్లు
టెండర్ అగ్రిమెంట్ వ్యయం	: రూ.1.61కోట్లు
భవన నిర్మాణ స్వరూపం	: జీ ప్లస్ 1 నాలుగు సూట్‌లు



శిథిలావస్థకు చేరిన భవనాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రానికి వచ్చే వీవీఐపీలు, వీఐపీలు బస చేసేందుకు ప్రభుత్వ అతిథి విశ్రాంతి గృహాలు స్థానికంగా అందుబాటులో లేవు. స్థానిక ఎన్టీఆర్‌చౌక్‌లో ఏళ్ల నాటి గెస్ట్‌హౌస్‌లో సరైన వసతులు లేవు. దీంతో వివిధ కార్యక్రమాలు, సమావేశాల్లో పాల్గొనేందుకు వచ్చే ముఖ్య నేతలు, రాష్ట్ర ఉన్నతాధికారులు ఇందులో ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు. ప్రైవేట్ హోటళ్లను ఆశ్రయించాల్సిన దుస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో ఎట్టకేలకు నూతన విశ్రాంతి గృహ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. శిథిలావస్థకు చేరిన భవనాన్ని సోమవారం కూల్చివేశారు. దాని స్థానంలోనే అధునాతన హంగులతో కూడిన నాలుగు సూట్‌లతో గెస్ట్‌హౌస్ నిర్మాణం జరుగనుంది.

ఇది పరిస్థితి..

రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర, కేంద్ర మంత్రులు వివిధ సందర్భాల్లో జిల్లా కేంద్రానికి వస్తుంటారు. అదేవిధంగా రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు సైతం వచ్చి వెళ్తుంటారు. వారు బస చేసేందు కోసం స్థానిక ఎన్టీఆర్‌చౌక్‌లో 1968లో ఆర్అండ్‌బీ అతిథి గృహాన్ని నిర్మించారు. దీంట్లో సరైన సదుపాయాలు లేవు. నిర్వహణ లోపంతో అక్కడికి వచ్చేందుకు ఎవరు ఆసక్తి చూపడం లేదు. దీనికి ఆనుకునే మరో భవనం నిజాం హయంలో నిర్మించారు. అది కూడా శిథిలావస్థకు చేరుకుంది. జిల్లా పరిషత్ విశ్రాంతి గృహంలోనూ ఇదే పరిస్థితి. అటవీ శాఖ విశ్రాంతి గృహంలో మాత్రమే మెరుగైన సదుపాయాలతో సూట్ రూమ్‌లు ఉన్నాయి. అయితే ఈ గృహంలో కొంత మంది ముఖ్య నేతలకు, అటవీ శాఖాధికారులకు తప్పితే మిగితా వారికి ఇచ్చే పరిస్థితి ఉండదు.

నాలుగేళ్ల తర్వాత పనులు ప్రారంభం

ఆర్అండ్‌బి విశ్రాంతి భవనం ఎదుట శిథిలావస్థకు చేరిన మరో విశ్రాంతి గృహం ఉంది. అక్కడ కొత్త అతిథి గృహన్ని నిర్మించేందుకు ఆర్అండ్‌బీ అధికారులు 2018లో ప్రతిపాదనలు సిద్ధం చేసి టెండర్లు పిలిచారు. కాగజ్‌నగర్‌కు చెందిన కాంట్రాక్టర్ అంచనా వ్యయం కంటే 18.09 శాతం లెస్‌కు టెండర్‌ను దక్కించుకున్నాడు. ఆ తరువాత కోవిడ్ నేపథ్యంలో ధరలు పెరగడంతో సదరు కాంట్రాక్టర్ ఆసక్తి చూపలేదు. దీంతో సదరు కాంట్రాక్టర్ డిపాజిట్ ఫోర్‌ఫిట్‌తో అధికారులు ఆ టెండర్‌ను రద్దు చేశారు. తాజాగా రీ టెండర్ పిలువడంతో మళ్లీ అంచనా వ్యయం కంటే 4.02 శాతం లెస్‌కు పనులు చేసేందుకు కాంట్రాక్టర్ ముందుకు వచ్చాడు. ఈ ఏడాది నవంబర్ 28న కాంట్రాక్టర్ అగ్రిమెంట్ చేసుకున్నారు. దీంతో ఎట్టకేలకు నాలుగేళ్ల తర్వాత నూతన అతిథిగృహం పనులు ప్రారంభమయ్యాయి. సకల హంగులతో కూడిన జీప్లస్ వన్ భవనాన్ని నిర్మించనున్నారు. కాగా శిథిలావస్థకు చేరిన పాత అతిథిగృహన్ని సోమవారం కూల్చివేసి భవన పనులను ప్రారంభించారు.

పనులు నాణ్యతతో జరిగేలా చూస్తాం



ఏడాది కాల పరిమితితో టెండర్ ఖరారు కావడంతో గుత్తేదారుకు పనులు అప్పగించాం. పాతభవనం తొలగింపు పనులు ప్రారంభమయ్యాయి. కొత్త భవన నిర్మాణ పనులు సైతం వెంటనే మొదలవుతాయి. పనులు నాణ్యతతో జరిగేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తాం. వచ్చే ఏడాదిలోగా నూతన భవనాన్ని అందుబాటులో ఉంచేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తాం.

– సురేష్ రాథోడ్, డీఈ, ఆర్అండ్‌బీ

పడిపోతున్న ఉష్ణోగ్రతలు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో రోజురోజుకు ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. దీంతో చలి తీవ్రత, ఈదురు గాలులతో జనాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడు నాలుగు రోజులుగా క్రమంగా ఉష్ణోగ్రతలు తగ్గుతుండడంతో జనాలు జంకుతున్నారు. చలి మంటలు కాగుతూ ఉపశమనం పొందుతున్నారు. సోమవారం కనిష్ట ఉష్ణోగ్రత 6 డిగ్రీలు నమోదు కాగా, గరిష్ట ఉష్ణోగ్రత 28.3 డిగ్రీలుగా నమోదైంది. తెల్లవారుజామున పారిశుధ్య కార్మికులు, పేపర్‌బాయ్‌లు, చిరు వ్యాపా రులు చలి కారణంగా వణికిపోతున్నారు. దీంతోపాటు పొగమంచు కమ్ముకోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించకుండా పోతున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో ఉదయం 10 గంటలు దాటినా చలి తీవ్రత తగ్గుముఖం పట్టడం లేదు.

కలెక్టరేట్ ఎదుట సీపీఎం ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కైలాస్‌నగర్: పత్తి క్వింటాల్‌కు రూ.10వేల ధరతో ప్రభుత్వరంగ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)తో కొనుగోళ్లు చేయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.మల్లేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిట్టుబాటు ధర లేక రైతులు పత్తిని అమ్మక ఇంట్లోనే నిల్వ చేసుకుంటున్నారన్నారు. వ్యాపారులు కుమ్మక్కుకావడం, సీసీఐ కొనుగోళ్లు చేపట్టకపోవడంతో రైతులకు మద్దతు దక్కడం లేదన్నారు. వ్యాపారులు రోజురోజుకూ ధరను తగ్గిస్తుండడంతో రైతులకు నష్టం వాటిల్లుతుందన్నారు. రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం వెంటనే సీసీఐని రంగంలోకి దించి పత్తి కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బండి దత్తాత్రి, ఆర్.మంజుల, లంక రాఘవులు, సురేందర్, గంగన్న పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: ఈ నెల 21నుంచి కేస్లాపూర్‌లో నిర్వహించనున్న నాగోబా జాతరలో విద్యుత్ పనులను ఎస్ఈ సంపత్ మంగళవారం పరిశీలించారు. అవసరమైన సామగ్రి, ఖర్చు వివరాలు తెలుసుకున్నారు. ఆలయం, మెస్రం వంశీయులు బస చేసే గోవడ్, మర్రిచెట్టు, జాతర ప్రాంతంలో ఎలాంటి విద్యుత్ సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. వెంటనే స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. డీఈ సుభాష్, ఏడీఏ చంద్రశేఖర్, ఏఈ రోహిదాస్ తదితరులున్నారు.

డిగ్రీ పరీక్షల్లో 17 మంది డిబార్

ఆదిలాబాద్‌టౌన్: కాకతీయ విశ్వ విద్యాలయం డిగ్రీ 3, 5 సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం 17మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆయా కళాశాలల్లో విద్యార్థులు మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతుండగా పట్టుకుని డిబార్ చేసినట్లు కేయూ పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ నరేందర్ తెలిపారు. నేరడిగొండ చైతన్య డిగ్రీ కళాశాలలో ఇద్దరు, బోథ్ వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఇద్దరు, ఇచ్చోడ ఛత్రపతి డిగ్రీ కళాశాలలో ఐదుగురు, ఖానాపూర్‌లోని అజ్మీర రేఖా శ్యాం డిగ్రీ కళాశాలలో ఒకరు, ఖానాపూర్‌లోని ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో ఒకరు, చెన్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆరుగురు విద్యార్థులు డిబార్ అయ్యారు.

వేలం ద్వారా రూ.11.18లక్షల ఆదాయం

ఇంద్రవెల్లి: కేస్లాపూర్‌లో నిర్వహించనున్న నాగోబా జాతరలో వివిధ హక్కుల కోసం మంగళవారం ఆర్డీవో సురేశ్ సమక్షంలో దేవాదాయ, రెవెన్యూశాఖల ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. తైబజార్ ద్వారా రూ.7.87లక్షలు, వాహనాల పార్కింగ్ ద్వారా రూ.1.66లక్షలు, విద్యుత్ సరఫరా ద్వారా రూ.1.13లక్షలు, ప్యాలల దుకాణం ద్వారా రూ.42 వేలు, కొబ్బరికాయల దుకాణం ద్వారా రూ.10,016.. మొత్తంగా రూ.11.18లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో రాజమౌళి తెలిపారు. ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, తహసీల్దార్ సోము, ఎంపీటీసీ మడావి భీంరావ్, మెస్రం వంశీయులు ఆనంద్‌రావ్, నాగ్‌నాథ్ తదితరులున్నారు.

బాసరలో ఒడిబియ్యం లెక్కింపు



ఒడిబియ్యం లెక్కిస్తున్న సిబ్బంది

బాసర (ముధోల్): బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో మంగళవారం ఒడి బియ్యం లెక్కించారు. 50.13 క్వింటాళ్ల ఒడి బియ్యం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. 273 కిలోల ఎండుకొబ్బరి, 26 కిలోల బరడిపోకలు, 54 కిలోల పసుపు కొమ్ములు, 19కిలోల బాదం, 30కిలోల ఖర్జూర పండ్లు, విడి సరుకులు సమకూరినట్లు పేర్కొన్నారు.

ఆదివాసీల ఆత్మబంధువులు!

- హైమన్‌డార్ఫ్, ఎలిజబెత్ దంపతులు
- నేడు మార్లావాయిలో 36వ వర్ధంతి
- గిరి సంప్రదాయ పద్ధతిలో నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన కమిటీ సభ్యులు



హైమన్‌డార్ఫ్ దంపతుల విగ్రహాలు



మార్లావాయి గ్రామస్తులతో హైమన్‌డార్ఫ్, బెట్టి ఎలిజబెత్ దంపతులు (ఫైల్)

నార్నూర్: అడవుల మధ్య బాహ్య ప్రపంచానికి దూరంగా ఉంటున్న ఆదివాసీల జీవితాల్లో వారు వెలుగులు నింపారు. స్వాతంత్ర్యానికి పూర్వమే 10వేల కుటుంబాలకు 1.60లక్షల ఎకరాల భూమి పంపిణీ చేసి వారి గుండెల్లో కొలువయ్యారు. వారంతా నేడు అభివృద్ధి దిశగా పయనిస్తున్నారంటే ఇది ముమ్మాటికీ వారి కృషి. అందుకే నేటికీ అడవిబిడ్డలు ఆ పుణ్యదంపతులను మరువలేకపోతున్నారు. ప్రతీ జనవరి 11న కుమురంభీం జిల్లా జైనూర్ మండలం మార్లావాయి గ్రామంలో పూర్తిగా గిరిజన సంప్రదాయ పద్ధతిలో వారి వర్ధంతిని ఘనంగా నిర్వహిస్తున్నారు. విశేష సేవలందించి వారి గుండెల్లో గూడు కట్టుకున్న మానవపరిణామ శాస్త్రవేత్త, ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్, బెట్టి ఎలిజబెత్ దంపతుల వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కథనం..

అధ్యయనానికి వచ్చి..

హైమన్‌డార్ఫ్ పూర్తి పేరు క్రిస్టోఫ్‌వోన్ ఫ్యూరర్ హైమన్‌డార్ఫ్. 1909 జూన్ 22న ఆస్ట్రేలియాలో జన్మించారు. మన దేశంలోని అస్సాం, మధ్యప్రదేశ్ తదితర ప్రాంతాల్లోగల ఆదిమజాతులకు చెందిన కొనాక్, నాగాల జీవన శైలిపై 1930లో అధ్యయనం చేసి మానవ పరిణామ శాస్త్రవేత్త అయ్యారు. నిజాం పాలనలో అడవిలో బాహ్యప్రపంచానికి దూరంగా ఉన్న ఆదివాసీలు పోడు సాగు కోసం ఆరాట పడుతున్న సమయమది. అడవినే నమ్ముకొని జీవిస్తున్న ఆదివాసీలకు భూములపై హక్కు కల్పించాలని అప్పటి నిజాం ప్రభుత్వ హయాంలో కొమురంభీం తిరగబడ్డారు. ఈ పోరాటంలో భీం నవంబర్ 1, 1940లో వీరమరణం పొందారు. నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆదివాసీల తిరుగుబాటు తనానికి గల కారణాలు తెలుసుకునేందుకు అప్పటి నిజాం ప్రభుత్వం మానవ పరిణామ శాస్త్రవేత్త హైమన్‌డార్ఫ్‌ను ఇక్కడికి పంపించింది. 1940లో ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్, బెట్టి ఎలిజబెత్ దంపతులు ఆదివాసీల ఆచారాలు, సంప్రదాయాలు, జీవన శైలిని పరిశీలించారు. ఇక్కడే వారితో కలిసిపోయి మార్లావాయి గ్రామంలో స్థిరపడ్డారు.

మార్లావాయిలో సమాధులు..

1990లో బెట్టి ఎలిజబెత్ హైదరాబాద్‌లో మృతి చెందగా.. ఆమె కోరిక మేరకు ఆదివాసీ సంప్రదాయం ప్రకారం మార్లావాయి గ్రామంలో సమాధి నిర్మించారు. ఎలిజబెత్ మరణానంతరం డార్ఫ్ ఇంగ్లాండ్‌కు తిరిగివెళ్లారు. అయినప్పటికీ ఆయన తరచూ మార్లావాయిని సందర్శించేవారు. 1995లో జూన్11న ఇంగ్లాండ్‌లో హైమన్‌డార్ఫ్ తుది శ్వాస విడిచారు. డార్ఫ్ దంపతులు ఆదివాసీలకు చేసిన సేవలను నేటికీ అడవిబిడ్డలు మరువలేకపోతున్నారు. ఏటా జనవరి 11న మార్లావాయిలో ఆ పుణ్య దంపతుల వర్ధంతిని పూర్తిగా గిరిజన సంప్రదాయ బద్ధంగా నిర్వహిస్తున్నారు. కాగా, వీరి వర్ధంతిని ప్రభుత్వమే ఐటీడీఏ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించాలని ఆదివాసీలు కోరుతున్నారు. నేడు వారి 36వ వర్ధంతిని మార్లావాయి గ్రామంలో పెద్ద ఎత్తున నిర్వహించనుండగా ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్యక్రమానికి ఎంపీ సోయం బాపూరావు, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కలెక్టర్‌తో పాటు అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వారు అందించిన సేవలివి..

ఆదివాసీల స్థితిగతులు, వారి అభివృద్ధికి కావాల్సిన సహకారం కోసం డార్ఫ్ అప్పటి ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. అతడి కృషి ఫలితంగా 1944 నుంచి 1948 వరకు నిజాం హయాంలో 10వేల గిరిజన కుటుంబాలకు రూ.1.60లక్షల ఎకరాల భూపంపిణీ జరిగింది. అంతేకాకుండా డార్ఫ్ సలహా మేరకు 1945లో గిరిజనుల అభివృద్ధి కోసం ప్రత్యేకాధికారిని నియమించారు. 1946లో మార్లావాయి, తాడవాయి, కొద్దమెల్ల ప్రాంతాల్లో 30 గిరిజన పాఠశాలలు స్థాపించారు. 1947లో గిరిజన ప్రాంతాలకు దస్తూరి-ఉల్-అమాల్ (1956 పట్టి) జారీ అయింది. దీని ప్రకారం గిరిజనుల హక్కుల పరిరక్షణకు అధికారులను నియమించారు. డార్ఫ్ ప్రోత్సాహంతో తొలిసారిగా ఆదివాసీ తెగ నుంచి తుకారాం ఐఏఎస్ సాధించారు. 1949లో నిజాం ప్రభుత్వం తదుపరి తెలంగాణలో హైదరాబాద్ ప్రభుత్వం వచ్చింది. నిజాం ప్రభుత్వ హయాంలో డార్ఫ్ చేసిన అధ్యయన ప్రతులు ప్రభుత్వానికి అందించారు. దీని మూలంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలో గిరిజనుల కోసం ప్రత్యేక హక్కులు, రిజర్వేషన్ల చట్టాలకు చోటు దక్కింది. రాజ్యాంగం అమలులోకి వచ్చిన 1950 జనవరి 26 నుంచి ఆనాటి 40 గ్రామాలు షెడ్యూల్డ్ ఏజెన్సీగా మారాయి. గిరిజనులకు రక్షణ కల్పించి 1949 నాటి దస్తూర్-ఉల్-అమాల్‌పై రాష్ట్రంలోనూ ఏజెన్సీ ప్రాంతంలో బ్రిటిష్ చట్టం (1915)ను సవరించబడి భూ బదలాయింపు చట్టం 1959లో ఏర్పడింది. తర్వాత 1/70 చట్టం అమలులోకి వచ్చింది.

పరిశోధన రచనలు

హైమన్‌డార్ఫ్ చుంచులు, గోండులు, కోయలపై పరిశోధన రచనలు చేశారు. ఇందులో చుంచుల్, జంగల్ ఫోల్క్ దక్కన్, రాజ్‌గోండ్స్ ఆఫ్ ఆదిలాబాద్, ద గోండ్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ట్రేడిషన్ అండ్ ఉల్‌యాన్ ఇండియన్ ట్రైబ్.. అనేవి ప్రసిద్ధిగాంచినవి. ఆదివాసీలతో డార్ఫ్ దంపతులకు ఏర్పడిన అనుబంధానికి ప్రతీకగా వారి సంతానానికి లచ్చుపటేల్‌గా నామకరణం చేశారు.

అధికారికంగా నిర్వహించాలి



హైమన్‌డార్ఫ్ వర్ధంతిని ప్రభుత్వం ఐటీడీఏ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించాలి. ఏటా జనవరి 11న హైమన్‌డార్ఫ్ యూత్ ఆధ్వర్యంలో గ్రామస్తులే నిర్వహిస్తూ వస్తున్నారు. ప్రభుత్వం ముందుకు వచ్చి వర్ధంతిని నిర్వహిస్తే ఆదివాసీ సమాజం హర్షం వ్యక్తంజేస్తుంది.

– కనక ప్రతిభ, సర్పంచ్, మార్లావాయి

ఆశయ సాధనకు కృషి చేయాలి



ఆదివాసీ గిరిజనులు అభివృద్ధి చెందాలంటే విద్య, వైద్యంతోపాటు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని హైమన్‌డార్ఫ్, బెట్టి ఎలిజబెత్ దంపతులు ఎంతో కృషిచేశారు. వారి ఆశయ సాధనకు కృషి చేస్తాం. వర్ధంతి నిర్వహించడానికి అన్ని రకాల ఏర్పాట్లు చేశాం.

– కనక వెంకటేశ్, వర్ధంతి నిర్వహణ కమిటీ చైర్మన్

ట్రిపుల్‌ఐటీలో పేరెంట్స్ మీటింగ్



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ

బాసర (ముధోల్): బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల తల్లిదండ్రులతో ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ మంగళవారం కళాశాలలోని సాత్ భవనంలో సమావేశమయ్యారు. పిల్లల చదువుల విషయంలో సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. ప్రతీ బుధవారం విద్యార్థులు నేరుగా డైరెక్టర్‌ను కలిసే వెసులుబాటు కల్పించామని చెప్పారు. గతానికి భిన్నంగా పరీక్షా ఫలితాలను రెండు వారాల్లోపు తల్లిదండ్రులకు తెలియజేస్తున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అడ్మిన్లు, అధికారులు, కళాశాల డైరెక్టర్ సతీశ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మహిళా సంఘాల స్టాల్



కళాఖండాలను ప్రదర్శిస్తున్న సభ్యులు

నార్నూర్: ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉట్నూర్‌లో నిర్వహించిన సైన్స్‌ఫెయిర్‌లో సరస్వతి మండల సమాఖ్య ఆధ్వర్యంలో అంబేద్కర్ వీవో గ్రూప్ సభ్యులు మంగళవారం ప్రదర్శించిన వెదురు కళాఖండాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చేతితో తయారు చేసిన 150 రకాల వెదురు కళాఖండాలను ప్రదర్శించినట్లు ఐకేపీ ఏపీఎం రమేశ్ తెలిపారు. గృహాలంకరణలు, చార్మినార్, ఈఫిల్‌టవర్, తాజ్‌మహల్, నెమలి, పక్షులు, ఎడ్లబండి, పూలస్టాండ్ తదితర ఉత్పత్తులున్నట్లు పేర్కొన్నారు. మంత్రి ఐకే రెడ్డి, జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి ప్రదర్శనను తిలకించారు. మహిళా సంఘాల సభ్యులను అభినందించారు.



ఇందులో మొదటి చిత్రం 13ఏళ్ల క్రితం వరకు ఇరుకుగా ఉన్న దస్నాపూర్ వంతెన. రెండోది అభివృద్ధిలో భాగంగా దానిని విస్తరించగా ప్రస్తుతం ఇలా కనిపిస్తోంది. గతంలో ఈ వంతెనపై చిన్నపాటి రాస్తారోకో జరిగినా రోడ్డుకిరువైపులా గంటల తరబడి వాహనాలు నిలిచి ట్రాఫిక్‌కు అంతరాయమేర్పడేది. నాలుగు వరుసల రహదారిగా అభివృద్ధి చేయగా ఇలా వాహనాలు వేగంగా సాగిపోతున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

విద్యార్థుల్లో ప్రతిభ వెలికితీయాలి



సైన్స్‌ఫేర్‌ను తిలకిస్తున్న మంత్రి ఐకే రెడ్డి

- రాష్ట్ర మంత్రి ఐకేరెడ్డి
- ఉట్నూర్‌లో సైన్స్‌ఫేర్ ప్రారంభం

ఉట్నూర్: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభతోపాటు సృజనాత్మకత వెలికితీయాలని రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని కేబీ ప్రాంగణంలో గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా సైన్స్‌ఫేర్‌ను ఆయన ఎమ్మెల్యే రేఖానాయక్, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల గిరిజన ప్రాంతాల విద్యార్థుల్లో ప్రతిభకు కొదువలేదన్నారు. వారిని ప్రోత్సహిస్తే ఎన్నో ఆవిష్కరణల ద్వారా ఉన్నత స్థానాలకు చేరుతారని చెప్పారు. ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు సైన్స్‌ఫేర్ నిర్వహించామని చెప్పారు. ఉమ్మడి జిల్లాలో 133 ఆశ్రమ పాఠశాలలుండగా, ఎనిమిది డివిజన్ల నుంచి 12 మంది విద్యార్థుల చొప్పున 96 మంది వివిధ ఆవిష్కరణలు చేశారని తెలిపారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. మాజీ ఎంపీ గోడం నగేశ్, ఆదిమ గిరిజన సలహా మండలి అధ్యక్షుడు కనక లక్కేరావ్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీరాంనాయక్, మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి, ఎంపీపీ జైవంత్‌రావ్, డీడీటీడబ్ల్యూ దిలీప్‌కుమార్, ఏటీడీవోలు క్రాంతి, నిహారిక, సౌజన్య, ఆయా విభాగాల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య

తాంసి: అనారోగ్యంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. భీంపూర్ ఎస్సై రాధిక తెలిపిన వివరాల ప్రకారం.. భీంపూర్ మండలం కరంజి(టి) గ్రామానికి చెందిన యువకుడు కరాడే అజయ్ (23) కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. సోమవారం రాత్రి ఇంటి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు త్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు, గ్రామస్తులు అతడిని వెంటనే రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతదేహాన్ని భీంపూర్ ఎస్సై రాధిక పరిశీలించారు. మృతుడి తండ్రి సుదర్శన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, కొడుకు పోయిన పుట్టెడు దుఃఖంలోనూ అజయ్ తల్లిదండ్రులు నేత్ర దానం చేశారు. మృతుడి కళ్లను ఎల్వీ ప్రసాద్ ఇనిస్టిట్యూట్ వైద్యులు సేకరించారు. కాగా, కొడుకు పోయిన బాధలోనూ నేత్రదానానికి అంగీకరించిన తల్లిదండ్రులను సర్పంచ్ నరేందర్, గ్రామస్తులు అభినందించారు.

స్కూటీ పైనుంచి పడి ఒకరికి తీవ్రగాయాలు

కుభీర్: మండలంలోని న్యూసాంవ్లి గ్రామానికి చెందిన జగ్మే గంగాధర్ మంగళవారం స్కూటీపై భైంసాకు వెళ్తున్నాడు. సాంవ్లి-కుంబి గ్రామాల మధ్య తనకుతానే స్కూటీ పైనుంచి కిందపడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని 108లో భైంసాకు తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు నిజామాబాద్‌కు తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు. కాగా, గంగాధర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ముధోల్: ముధోల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపాన మంగళవానం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బాసర మండల కేంద్రానికి చెందిన శివ ద్విచక్రవాహనంపై భైంసా నుంచి బాసర వైపు వెళ్తుండగా.. మహారాష్ట్రకు చెందిన సక్షేణ విఠలితండా నుంచి భైంసా వైపు ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. ముధోల్ ప్రభుత్వ జూనియస్ కళాశాల సమీపాన ఈ రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో శివకు తీవ్ర గాయాలు కాగా, సక్షేణకు స్వల్పగాయాలయ్యాయి. ఇరువురిని చికిత్స నిమిత్తం 108లో భైంసా ఏరియా సుపత్రికి తరలించారు.

ఆటో ఢీకొని మహిళకు తీవ్రగాయాలు

ఆదిలాబాద్‌టౌన్: ఆటో ఢీకొని మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. వన్‌టౌన్ ఎస్సై హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని రవీంద్రనగర్ కాలనీలో ఈనెల 5న అదే కాలనీకి చెందిన సక్కిరెడ్డి లక్ష్మి తన స్నేహితురాలు రోషిని రోడ్డు పక్కన నిలబడి ఉన్నారు. ఈక్రమంలో ఆటో ఢీకొనగా లక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను రిమ్స్‌కు తరలించారు. చికిత్స అనంతరం ఆమె మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కత్తితో యువకుడిపై దాడి

ఆదిలాబాద్‌టౌన్: యువకుడిపై కత్తితో దాడి చేసిన ఘటన ఆదిలాబాద్ పట్టణంలోని డైట్ కళాశాల మైదానంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ ఎస్సై నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రణదీవెనగర్‌కు చెందిన వంశీకృష్ణ, ఆదిలాబాద్‌రూరల్ మండలం అర్లి(బీ) గ్రామానికి చెందిన సాయికు పాత కక్షలున్నాయి. సోమవారం మధ్యాహ్నం పట్టణంలోని డైట్ గ్రౌండ్‌కు రావాలని వంశీకృష్ణ సాయికి ఫోన్ చేశాడు. దీంతో సాయి అక్కడికి వెళ్లాడు. ఇద్దరి మధ్య మాటామాట పెరగడంతో వంశీకృష్ణ సాయి ఛాతిలో కత్తితో పొడిచాడు. దీంతో సాయి గాయపడగా స్థానికులు అతడిని రిమ్స్‌కు తరలించారు. బాధితుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

మాజీ హోంగార్డు ఆత్మహత్య

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రానికి చెందిన మాజీ హోంగార్డు ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గతంలో హోంగార్డుగా పని చేసి సస్పెన్షన్‌కు గురైన ముడారపు రమేశ్ (45) కొద్దిరోజులుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈక్రమంలో సోమవారం ఇంటి వద్ద విషం తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు.

గడ్డివాము దగ్ధం

దిలావర్‌పూర్: మండల కేంద్రానికి చెందిన రైతు కట్కం రవీందర్ అలియాస్ బర్ల స్వామికి చెందిన గడ్డివాము మంగళవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమైంది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది అక్కడికి చేరేలోపు పూర్తిగా కాలిబూడిదైంది. సుమారు రూ.2లక్షల విలువైన గడ్డి కాలిపోయినట్లు బాధితుడు తెలిపాడు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో 60మందికి జైలు

ఆదిలాబాద్‌టౌన్: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో 60మందికి ఒక్కరోజు జైలుశిక్ష విధిస్తూ ఆదిలాబాద్ సెకండ్ క్లాస్ ఇన్‌చార్జి జడ్జి యశ్వంత్‌సింగ్ చౌహాన్ మంగళవారం తీర్పు చెప్పారు. ఆదిలాబాద్ పట్టణంలోని వన్‌టౌన్, టూటౌన్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన కేసుల్లో వీరు నిందితులు. జిల్లాలో ఇలాంటి తీర్పు రావడం ఇదే మొదటిసారి. గతేడాది అత్యధికంగా ఐదువేలకు పైగా డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 10రోజుల్లోనే 300 కేసులు నమోదయ్యాయి.

నిర్మల్‌లో పలువురికి..

నిర్మల్‌టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపిన ఒకరికి మూడురోజుల సాధారణ జైలు, 34మందికి జరిమానా విధిస్తూ ద్వితీయశ్రేణి న్యాయమూర్తి అజిత్ రెహమాన్ తీర్పు చెప్పారు. పట్టణ ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలో మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. మద్యం మత్తులో వాహనం నడుపుతూ పలువురు పట్టుబడగా వారిని నిర్మల్ కోర్టులో హాజరు పరిచారు. ఇందులో ఒకరికి సాధారణ జైలు శిక్ష, 34 మందికి రూ.55,200 జరిమానా విధించారు.

కడెం ఆయకట్టుకు నీటి విడుదల



నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

కడెం: కడెం ప్రాజెక్ట్ ఎడమ కాలువకు మంగళవారం ఎమ్మెల్యే రేఖానాయక్ యాసంగి సాగుకు నీటిని విడుదల చేశారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, 694.550 అడుగులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎడమ కాలువకు 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఏఎంసీ చైర్మన్ శంకర్, డైరెక్టర్ మంగ, సర్పంచ్ అనూష తదితరులు పాల్గొన్నారు.

గోదావరి జలంతో తిరుగు పయనం

- పుణ్యస్నానాలాచరించి, రాగిపాత్రలో నీటిని నింపి..
- కేస్లాపూర్‌కు బయలుదేరిన వంశ పెద్దలు



తిరుగు పయనమైన మెస్రం వంశీయులు

జన్నారం: కేస్లాపూర్ నాగోబా జాతర సందర్భంగా మహాపూజకు కావాల్సిన గంగాజలం కోసం మెస్రం వంశీయులు మండలంలోని కలమడుగు గోదావరికి మంగళవారం ఉదయం చేరుకున్నారు. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి వంటలు చేసుకుని భోజనాలు చేశారు. గోదావరి తీరంలోని హస్తల మడుగులో ప్రత్యేకమైన రాగి చెంబులో నీటిని నింపారు. అనంతరం చెంబును కర్రకు కట్టుకుని సంప్రదాయ తెల్లని దుస్తులతో తిరుగు పయనమయ్యారు. ఈ నెల 2న కేస్లాపూర్ నుంచి బయలు దేరిన మెస్రం వంశీయులు కాలినడకన మంగళవారం చేరుకున్నారు. ఇక్కడి నుంచి ఉట్నూర్, దొడందాలో బస చేసి, విశ్రాంతి తీసుకున్న అనంతరం 17న ఇంద్రవెల్లిలోని ఇంద్రాయి ఆలయానికి చేరుకుని పూజలు చేయనున్నట్లు మెస్రం వంశ పెద్దలు ప్రదాన్ మెస్రం దాదరావు, కటోడా మెస్రం కోసు, హన్మంతరావు, మెస్రం ఉద్యోగుల సంఘం నాయకులు మెస్రం మనోహర్, మెస్రం దేవరావు, మెస్రం శేఖు, తుకారాం నాగనాథ్ తెలిపారు.